International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.10, Issue-3, July-September, 2023
Impact Factor: 6.023; email: drtvramana@yahoo.co.in

# నేటి స్త్రీలకు అంబ/శిఖండి ఆదర్శము

**Dr. O. Rama Rao**
Lecturer in Sanskrit
Govt. Degree College (Men),
Srikakulam, A.P

**వ్యాస సంగ్రహం(Abstract):** మహాభారతంలో భీష్ముని పాత్ర అత్యంత ప్రధానమైనది. అయితే ఇంతటి మహనీయుడిని అంబ/శిఖండి ఎందుకు పగగొన్నాదో, ఎందుకు శిఖండిగా పునర్జన్మలో మగవానిగా మారిందో, తనకి జరిగిన అన్యాయాన్ని ఏ విధంగా ఎదిరించిందో, భీష్ముని అస్త్ర సన్యాసానికి, ఆతని పతనానికి ఏవిధంగా కారణమైందో, అంబ/శిఖండికి జరిగిన అన్యాయం ఏమిటో ఆంధ్రమహాభారత గ్రంథమాధారంగా విశ్లేషణాత్మకంగా పరిశీలించడమే ఈ వ్యాసముఖ్యోద్దేశం.

**Key Words:** కవిత్రయం, ఇతిహాసం, అనువాదం, పగ, అన్యాయం, పునర్జన్మ, అస్త్ర సన్యాసం, పతనం.

**ఉపోద్ఘాతం :**

సంస్కృత వాఙ్మయంలో వేదవ్యాస మహర్షి విరచితమైన మహాభారత ఇతిహాసం భారతీయ వాఙ్మయంలో అత్యంత ప్రశస్తికెక్కింది. దాన్ని తెలుగులో నన్నయ్య, తిక్కన్న, ఎఱ్ఱన్న ముగ్గురు అనువదించారు. వీరి ముగ్గురు ఆంధ్రనాట కవిత్రయంగా ప్రసిద్ధికెక్కారు. వీరిలో ఆద్యుడైన నన్నయ్య మహాభారత గ్రంథాన్ని గురించి ఈవిధంగా పేర్కొన్నాడు.

సీ. ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని । యధ్యాత్మవిదులు వేదాంత మనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రం బని । కవివృషభులు మహాకావ్య మనియు,
లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహ మని । యైతిహాసికు లితిహాస మనియుఁ,
బరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చ । యఁ బని మహిఁ గొనియాడుచుండ.
ఆ. వివిధవేదతత్త్వవేది వేదవ్యాసుఁ । డాదిముని పరాశరాత్మజుండు

విష్ణుసన్నిభుండు విశ్వజనీన మై । పరఁగుచుండఁ జేసె భారతంబు.[1]

ఇన్ని సకల గుణాలు కలిగిన మహాభారతంలో పురుషార్థాలకి బల్లై, ఆత్మాభిమానము, ఆత్మవిశ్వాసము, ఆత్మస్థైర్యము కలిగి అంబ తనకి జరిగిన అన్యాయానికి ప్రతిగా, భీష్ముని ఏవిధంగా సాధించిందో విశ్లేషణాత్మకంగా పరిశీలించడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

ఈ సందర్భంగా అంబ పాత్ర పరిశీలించిన పరిశోధకులు డా|| విజయ భారతి, డా|| పాలపర్తి శ్యామలానంద ప్రసాదు గారు ప్రాతఃస్మరణీయులు.

ప్రధాన విషయం:

అంబ తన మనోరథాన్ని చతురతతో భీష్ముడికి వెల్లడించుట:

భీష్ముడు కాశీరాజ కుమార్తులయిన అంబ, అంబిక, అంబాలికలను తన తమ్ముడైన విచిత్రవీర్యునికిచ్చి, పెళ్ళి చేయడానికి హస్తినపురానికి తరలించిన సందర్భంలో భీష్ముని ఉద్దేశించి, పలికిన పలుకులు.

తే. సౌంభపురవల్లభుండైన సాళ్వుమీఁదఁ। దలఁపుగలదు నా, కతఁడును దగులు గలిగి

యుండు నాదెస నీవు ధర్మోత్తరుండ । వతని పాలికిఁదగ నన్ను ననుపవయ్య ।[2]

సౌంభపట్టణాధీశ్వరుడైన సాళ్వుడిమీద నాకు అనురాగం ఉన్నది. అతడు కూడ నా యొడల మమత కలవాడు. నీవు ధార్మికులలో అగ్రగణ్యుడవు కనుక, అతడి దగ్గరకు నన్నుసాదరంగా పంపవేడుకొంటున్నాను అని అంబ పలికింది కాని వారిలో పెద్దదైన అంబ తన మనస్సును పూర్వమే సాళ్వుడికి అర్పించా అని భీష్ముడికి చెప్పగా, అతడామెను సాళ్వరాజు దగ్గరకి పంపించాడు. ఈవిధంగా అంబ తన ప్రేమ వృత్తాంతం చెప్పి, తన మనోగతాన్ని నిరూపించుకొంది.

సాళ్వుడు అంబ శీలాన్ని శంకించుట :

నిన్ను భీష్ముడు అపహరించిన కారణంగా నీ కన్యాత్వం తొలిగిపోయింది. నువ్వు దుష్టురాలివి నిన్ను భార్యగా స్వీకరించడం ధర్మంకాదు అని సాళ్వుడు నిరాకరించాడు.

క. అంబయు నట సాళ్వునికడ కుంబోయిన నతడు భీష్ము కొనిపోయినదా

నింబరచుం గైకొన ధర్మంబే కన్యాత్వమెడలె మగువా నీకున్[3]

**నిరాకరించిన సాళ్వుని అంబ తన తప్పేమిటని ప్రశ్నించుట :**

తే. తమ్మునికి గాగ బీష్ముడు దగ్ర వృత్తి గన్నియల గొనిపోయెడు గానబలిమి
నన్ను గొనిపోయె, నాచేత నిన్నువినిన, యపుడెపుత్తెంచె దూషింప ననఘుతగునె[4]

పుణ్యాత్ముడా ! భీష్ముడు తన తమ్ముడి కొరకై బలాత్కారంగా కన్యలను గొనిపోతుండటం వలన నన్ను కూడ వారితోపాటు తీసికొని వెళ్ళాడు. నా వలన నిన్ను నే వలచిన సంగతి వినిన వెంటనే, నన్ను నీ కడకు పంపివేశాడు. మరి దూషించిన విషయం ఇందులో ఏముంది అని అంబ ప్రశ్నించింది.

**తిరస్కృతయైన అంబ నిస్సహాయురాలై విలపించుట :**

అంతట అంబ సాళ్వునికి జాలి కలుగునట్లు విలపించింది కాని అతడు ఆమెను వెళ్ళి పొమ్మననెను. చివరికి అతడు తన భవనం నుంచి తరిమివేయగా, అంతట ఆమె మిక్కిలి దు:ఖముతో ఆర్త చిత్తంతో వికలగతితో నిస్సహాయురాలై వెళ్లిపోయిన తీరు ఈ విధంగా వర్ణించబడింది.

క. కరుణంబుగ నేడ్చుతలో, దర్చి బోపొమ్మిచట నికదడయకు మని మం
దిరము వెడలంగ నడిచిన, నరిగె నదియు నార్తచిత్తయై వికలగతిస్[5]

**భీష్ముని పట్ల అంబ పగ బూనుట :**

అంబ తన భావోద్వేగమును తెలియజేయుటలో ఆమె యొక్క పట్టుదల, పగ ఈ క్రింది విధంగా కనబడుతున్నాయి.

సాళ్వుడికి నేను ఇల్లాలుగా పనికిరానప్పుడు మరెవ్వరికిని పనికిరాను. నాబ్రతుకు ఛిద్రమైంది అని ఇప్పుడు నేను భీష్ముడి దగ్గరకు వెళ్ళి మాత్రం ఏమి ప్రయోజనం ? ఈ చేటున కంతకు మూలం భీష్ముడే కనుక అతడిని సాధించి తీరుతాను అని ప్రతిన పూనింది.

తే. సాళ్వునకు గానియపుడ సంసారమునకు బాసితిన యింక భీష్ముని పాలికేల
యరుగ ? నాతండు మూల మీ హానికెల్ల, గాన యాతని సాధింతు గాకయేను[6]

**అంబ తపము పూనుట, భీష్ముని చంపబూన నిశ్చయించుట – పరశురాముడ్ని శరణు వేడుకొనుట:**

అంబ తన మానసిక క్షోభను తొలగించుకొనటానికై వచ్చి, తన భావోద్వేగాన్ని పరుశురామునితో ఈ క్రింది విధంగా తెలియజేయుచున్నది.

(ఓ పరుశురామ మహాత్మా ! నన్ను సాళ్వుడు ఇక పత్నిగా స్వీకరించడు. అతడిని శిక్షించి ప్రయోజనం లేదు. నన్ను బలాత్కారంగా తెచ్చిన భీష్ముడిపై ఉగ్రకోపం నాకు ఉన్నది. అతన్ని చంపటానికై తపస్సు చేయాలని ఇక్కడికి వచ్చాను.)

చ. అనవుడు నింతి యిట్లను మహాపురషా నను సాళ్వుడింక గై
కొన డది సాలు భీష్ముదెస గోపము నామది గల్గి యుండు నా
తని వధియింప బూని యిటు తాపసవృత్తికి వచ్చి యిచ్చట
నిను గని యీ పరాభవము నీగగ నీశరణంబు జొచ్చితిన్[7]

**అంబ అకుంఠితమైన తపోదీక్ష నిరాశతో మరణింపబూనుట యక్షుని సహాయం శిఖండిగా పురుషాకృతి దాల్చుట:**

అంబ తన కోరిక వైఫల్యం చెందినప్పటికి, ఓర్పుతో, తీవ్రమైన తపస్సు చేసిన కారణంగా శివుడు అనుగ్రహించాడు. మొదటగా ద్రుపదునికి కుమార్తెగా పుట్టి, అనంతరము పురుషుడుగా మారగలవని శివుడు ఆమెకు చెప్పి అంతర్ధానమయ్యాడు. అంత పరమేశ్వరుని మాటపై విశ్వాసంతో ద్రుపదుడు తనకు కలిగిన కుమార్తెను కుమారుడుగా లోకానికి పరిచయం కావించి, “శిఖండి”గా నామకరణం చేసాడు. యుక్త వయస్సు రాగానే శిఖండికి దశార్ణరాజయన హిరణ్యవర్మ కుమార్తెతో వివాహం చేసాడు. కొంత కాలానికి శిఖండి పురుషుడు కాదని తెలియటంతో హిరణ్యవర్మ ద్రుపదునిపై యుద్ధానకి సిద్ధపడ్డాడు. అంత తన కోసం తల్లిదండ్రుల దు:ఖాన్ని చూసి, శిఖండి రూపియైన అంబ తీవ్రమైన తపస్సు చేసింది. కాని విఫల మనోరథయై నిందను భరింపలేక, అన్యమార్గం లేక మరణింప నిశ్చయించుకొన్నట్లు ఇట్లు వర్ణితమైంది.

క. అప్పుడు శిఖండి మరణము । దప్పగ నడి కొండు ప్రతివిధానము సేయం
జొప్పడమి దలచి యొరులకు జెప్పక వెసనరిగె బురము చెంత యడవికిన్.[8]

అప్పుడు స్థూలకర్ణుడనే యక్షుడు అంబ యందు ప్రసన్నుడై తన పురుష రూపం ఆమెకిచ్చి, ఆమె స్త్రీ రూపం తాను తీసికొని వెళ్ళిపోయాడు, అది ఇట్లు వర్ణితమైంది.

క. అంతవునంతకు నీదగు । కాంతారూపంబు నేను గైకొనియెద: ని
శ్చింతమున మగుడ జను మని । యింతికి బురుషత్వ మిచ్చె నెంతయు వేడ్కన్.[9]

అంత తన కూతురు కుమారుడుగా అయినందుకు ద్రుపదుడు చాలా సంతోషించాడు. తరువాత అతడు శిఖండిని ద్రోణునికి అప్పగించాడు. ద్రోణ శిష్యునిగా శిఖండి అస్త్ర శస్త్ర విద్యావిశారుదుడైనట్లు ఇట్లు వర్ణితమైంది.

వ. చెప్పి వీడుకొలిపిన శిఖండి యత్యంత ప్రమోదంబునం దండ్రి కడకు వచ్చి యత్తెఱం
గెఱింగించిన నాతండు ప్రీతుండయి దేవగురుద్విజపూజనంబు లాచరించి ద్రోణాచార్యపాల
సవిశేషంబుగా శిష్యభావంబు ప్రతిష్ఠించె.[10]

ఈ విధంగా అంబ శిఖండిగా భీష్ముని ఎదుర్కొనే సామర్థ్యం సాధించింది.

అవరోధాలు అధిగమించిన అంబ, శిఖండిగా భీష్ముడిపై పగ తీర్చుకొనుట:

భారతయుద్ధములో ఈ శిఖండిని అడ్డం పెట్టుకునే అర్జునుడు భీష్ముడిపై బాణాలు వేసి, అతడిని కుప్పకూల్చాడు. ఆవిధంగా అంబ శిఖండిగా పుట్టి, భీష్ముడిపై పగతీర్చుకుంది. తన అభీష్టాన్ని నెరవేర్చుకుంది. మరి కార్యసాధనలో ఎన్నో ఒడుదుడుకులు, నిరాశ, నిస్పృహ, ఆటంకాలు, ఎదురైనప్పటికి అటు సాళ్వుడు, ఇటు భీష్ముడు ఇద్దరూ నిరాకరించినప్పటికి, తనకు జరిగిన అన్యాయాన్ని ధైర్యంగా ఎదిరించి, అలుపెరగని పోరాటాన్ని సాగించి, మొక్కవోని పట్టుదల, అకుంఠితమైన దీక్షతో నిరాశ చెందకుండా, ఆత్మవిశ్వాసంతో లక్ష్యం సిద్ధించే వరకు ఏ సందర్భంలోనూ కృంగిపోకుండా కార్యసాధనలో సడలని ధైర్యంతో, ఆగ్రహావేశాలకి ఏ మాత్రం గురికాకుండా, విజయ ప్రయత్నం ఏ విధంగా చేసిందో ఈ క్రింది విధంగా వర్ణించబడింది.

ఉ. "ఎవ్వత నేని ధాత సృజియించె దగన్ మగవాని గా గ నా
కొవ్వమి జేసి యట్టి నిను నుగ్మలి నేయగ నొల్ల నాపయిం
గ్రొవ్వెసలార నీవు శరకోటి వెసం బరగించితేని నే
నవ్వుదు గాని కోపము మనంబున బుట్టదు సూ శిఖండినీ !
ప. అనినం గోపించి శిఖండియు నతని కిట్లనియె

క. గెలిచితి రాజుల నెల్లను । బలియుండగు పరశురాముప్రతివీరు డవై
యలవుకలిమి నెఱపిన । నీ చలము బలము నాకు జూప జాలవు కంటే?

క. ఏయు మొకనేర్పుమైని । ట్టేయక క్రీడించి యరుగు మెట్లయినను మ
త్సాయకముల నిను గూల్చెద । జూ యెవ్వత నైతి నేమి
సూచెదు ? నన్నున్.

క. నే డెమ్మెయి నైనను నీ । పోడిమి సెడ దోన తవిలి పొదవుదు నిన్నున్
వాడి మగ డనుట యుడుపుదు । వేడిమి సొంపెసగ సస్త్రవిద్య
మెఱయుదున్.

వ. అనుచు మఱియు నైదమ్ములేసె నప్పలుకులు విని ఫల్గునుండాత్మగతంబున నేడు శిఖండి చందంబు వింతయయియున్న యది. నదీనందనుండు సమయుటకు సమయంబైన దైవదత్తోత్సాహంబున నేచి పలికెంగావలయునని యూహించి యుపోద్బలంబుగా నతని కిట్లనియె"[11]

తన యత్నంలో భాగంగా తపోదీక్షతో భగవత్ కృపాకటాక్షాలను పొంది, అబల అయినప్పటికి నిరాశ చెందక, తీవ్ర నిరసనలను ఎదిరించిన యుక్తిరాలు, అంబ.

ముగింపు:

హిందూసంస్కృతిలోని చాలా విశ్వాసాలకు పురాణ వాఙ్మయం ఆధారం. ముఖ్యంగా స్త్రీల ప్రవర్తనను నియంత్రించటానికి పురాణ కథలలోని స్త్రీ పాత్రలను తమకు అనుకూలించే విధంగా ఉదహరిస్తూ వాటిని ఆదర్శంగా చెబుతుంటారు. నెగెటివ్ లక్షణాలున్నవాటిని, తీవ్రస్వభావాన్ని సూచించే పాత్రలను మరుగున పడేస్తారు. ఆవిధంగా మరుగున పడేసిన పాత్ర

అంబ మహాభారత వీరుడుగా, కురుపాండవ పితామహుడుగా అజరామరుడైన భీష్ముని అంత ధీటుగానూ ఎదుర్కొన్న సాహసి అంబ. స్త్రీ ఆత్మగౌరవానికి ఆమె ప్రతీక. ఆమె చేసిన ప్రతిజ్ఞ నెరవేర్చుకున్న ధీరురాలు. డా|| విజయభారతి గారు తన పరిశోధన వ్యాసంలో పై విధంగా పేర్కొన్నారు.[12]

ఆ విధంగానే డా|| పాలపర్తి శ్యామలానందప్రసాద్ గారు తన పరిశోధన వ్యాసంలో ఈ విధంగా పేర్కొంటున్నారు. అంబ తొలితరం స్త్రీవాది అంటే కాదనడానికి కారణం ఏమీ కనపడటం లేదు. భీష్ముడు పురుషహంకారాన్ని జన్మలకొద్ది నీడలా వెంటాడి శిఖండిలా అవతరించి అతడి మరణం చూసిందామె.[13]

అంబప్రేమ, జాలి, ఆవేదన, పగ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, అభిమానం, ధైర్యం, కార్యదీక్ష కలిగినటువంటి సంపూర్ణమూర్తిమత్వం కల ధీర స్త్రీగా మహాభారత ఇతిహాసంలో చిత్రితమైంది.

నేటి సమాజంలోని మహిళలు కూడా తమకు అన్యాయం జరిగినప్పుడు, అంబ పాత్ర ఆదర్శంగా గ్రహించి పట్టుదల, ఓర్పు, సహనాలతో తమ కార్యంను సాధించుకోవలెను. స్త్రీ అబలకాదు సబలే. పురుష భావానికి పౌరుషం ఎలాగో, స్త్రీకి స్త్రీత్వం అలాంటిదే. స్త్రీ భీరుత్వానికి సంకేతం కాదు. గాజులు తొడగిన చేతులే గమ్యాలని నిర్దేశిస్తున్నాయి. అంబ పరిపూర్ణమూర్తిమత్వం కల మహిళామణి.

**పాద సూచికలు**

1. ఆంధ్రమహాభారతం - నన్నయ్య - ఆదిపర్వం – ఆశ్వాసం - 1 - పద్యం - 32
2. ఆ.మ. భా - నన్నయ్య - ఆ.ప - ఆ - 4 - ప - 275
3. ఆంధ్రమహాభారతం - తిక్కన్న - ఉద్యోగపర్వం – ఆశ్వాసం - 4 - పద్యం - 278
4. ibid - ప - 280
5. ibid – ప - 282
6. ibid – ప – 284
7. ibid – ప – 298
8. ibid – ప – 383

9. ibid – ప – 388

10. ibid – ప – 398

11. ఆంధ్రమహాభారతం- తిక్కన్న- భీష్మపర్వం- ఆశ్వాసం- 3-పద్యములు - 322 - 327

12. అంబ - డా|| బి విజయ భారతి

13. పురుషహంకారానికి జవాబు శిఖండి - డా|| P. శ్యామలానంద ప్రసాద్

**ఆధార గ్రంథాలు:**

1. సంస్కృతమహాభారతం – వేదవ్యాస మహర్షి, గోరఖ్‌పూర్ ప్రచురణ - సం॥ – 2018, గీతా ప్రెస్ పబ్లికేషన్స్, గోరఖ్‌పూర్, ఉత్తరప్రదేశ్.

2. ఆంధ్రమహాభారతం – తిక్కన్న – ఉద్యోగపర్వం, భీష్మపర్వం, తి.తి.దే. ప్రచురణ - సం॥ - 2008, తిరుపతి.

3. పరిశోధన విధానం – ఆచార్య ఎస్. జయప్రకాశ్ ప్రచురణ – జనవరి – 2009 విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

4. స్త్రీవాద పత్రిక భూమిక – 22 – 03- 2018

5. పురుషహంకారానికి జవాబు శిఖండి – సాక్షి – 12 – 09- 2014

6. సంస్కృత సాహిత్య చరిత్ర, డా ముదిగంటి గోపాలరెడ్డి, వేదాలంకార్ మరియు డా. ముదిగంటి సుజాతరెడ్డి, పొట్టి శ్రీరాములు – తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు – 500004, ప్రచురణ – 1997

7. సాహిత్యం – సమాజం - రాజకీయాలు, ఆచార్య – పైర్వారం జగన్నాధం, పొట్టి శ్రీరాములు – తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు – 500004

***